ఉరిశిక్ష

తంగిరాల రాధాకృష్ణయ్య, బి. ఏ., బి. యల్.

౧

ఉస్సురుమని లేచి కూర్చున్నది. పేరమ్మకు ఆవేదన దుర్భరమయింది. పగలో రాత్రో కూడా తెలీలేదు. మూ రోజుల నుంచి నిద్రకానీ, ఆహారంకానీ లేనప్పుడు ఎట్లా తెలీడం? కునికిపాటు పడిందో లేదో, ఎవరో తనరొమ్ముమీద కూర్చొని గ్రుద్దుతూవున్నట్లయింది. ఇటు కండ్లు తెరిస్తే ఊపిరాడటం లేదు. ఏమంటే ఏముంది? ఏదో పీడకలకాబోలు అని సర్దుకొనేదే. అయితే అట్టిసమాధాన మామెకు నచ్చలేదు. అబ్బా! అని పైకి చూచింది. చూస్తే ఏముంది — నిరామయం — నిర్భేద్య మైన జెయిలుగోడలు ఆమెనుప్రక్క-చూచి నాక్రమింగ చేసాయి. ఒక సన్న రంధ్రము మాత్రము కప్పు వద్ద కనుపడ్డది. అరచేతి వెడల్పు వుందో లేదో, దానికి నాలుగు గడ్డపారల లాంటికమ్మీలు అడ్డం బిగించి

వున్నాయి. దాన్ని చూచేటప్పటికి, ప్రపంచానికీ నాకు, ఇదొక్కటైనా సంబంధం వుంది కదా అనిపించిం దామెకు. ఉత్తరక్షణంలోనే దిగులు కలిగింది. ప్రపంచమంటే తనకేమి మొఖమాటం—తనకూ ప్రపంచానికీ ఏమిసంబంధము? ప్రపంచంలో వుండతగనిదనిగదా ఆమెకు ఈ వురిశిక్ష విధించారు—ఈవిషవృక్షాన్ని పెరగనీయకూడదని, ఇట్లాంటిముళ్లకంచెలను లాగేస్తే దేశాన్ని మరామ్మతు చేయవచ్చునని.

౨

ఇంతలో తనకు ఎదురుగ్గా గోడమీద మసుగ్గా వెలుతురు కనుపడ్డది. వెన్నెలతునక వైరంధ్రంనుంచి లోపల జొరబడ్డది. పేరమ్మకు ఆవేదన ఇంకా జాస్తిఅయింది. ఈ చంద్రబింబం తనమంచికేనా వచ్చింది? ఈ వెన్నెలకు ఈ దీనురాలితో ఏమి అవసరం? లోకానికంతా రోతఅయిన యీ పేరమ్మను కూడా యీ వెన్నెల ఎందుకు కనుక్కోవాలె? ఇంకా తనకు దేముడిసంగతి ఏమైనా జ్ఞాపకంచేయడానికి వచ్చిందాఏమి?—ఛీ—తనకూ దేముడికీ ఇలాకా ఏమిటి?—

౩

ఇంతలో జెయిలువెలుపల పారాజమాను కేక వినబడ్డది. జెయిలులోనుంచి ఎవ్వరూ తప్పించుకొనిపోకుండా కాపుదలచేస్తూ వున్నాడు. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం. తనేనా తప్పించుకపోయ్యేది! తప్పించుకపోయేటట్లయితే యీ శిక్షలు కమామిషి ఎందుకూ? ఆహా! తప్పించుకుంటే!— ఒళ్లు పులకరించింది. మళ్లీ తనవూరు, తనవాండ్లు-హాయిగా, నిశ్చింతగా కాలంగడపవచ్చు. తనతో ముద్దాయిగావుండి తప్పించుకొన్న కోటయ్యమొఖమైనా చూస్తుందా. అరే!— కోటయ్య!— పదేళ్లుగా నమ్మించి తనతో సుఖించి, ఒకటిగా నుండి, ఆఖరుకు కష్టాలువచ్చి యీ కేసు పైనబడేటప్పటికి నేరమంతా యీపెమీదికి తోసి తప్పించుకుపోయినాడు. అబ్బా! అసలు నేరంచేసింది వాడే—తను అమాయకురాలే. తెలీక కోటయ్యను నమ్మి అతను చెప్పినట్లు చేసేటప్పటికి యింతముప్పు వచ్చింది. ఇంక ఆకోటయ్య మొఖాన ఉమ్మిఅయినా వేస్తుందా. అప్పుడు చివుక్కున ఆమెకు రామస్వామిసంగతి జ్ఞాపకంవచ్చింది. అయ్యో, ఎంతయోగ్యుడు రామస్వామి! అట్టిపెద్దమనిషిని చంపించినాడే కోటయ్య. తనో, తను ఏమర్మం ఎరుగదుగా మరి. కోటయ్య రామస్వామికి ఎప్పుడూ తెచ్చియిచ్చినట్లు ఆవేళ కూడా తెచ్చాడు మందు. పేరమ్మను కలిపి యియ్యమన్నాడు. పేరమ్మ యీ మందుకలిపి యిచ్చినగంటలో రామస్వామి ఎగిరిపోయినాడు. ఇంతలో వారు వీరు, పోలీసులు మేస్త్రీటులు, అంతావస్తే, మరి యీ పిచ్చి పేరమ్మ, "అవును నేనే మందుయిచ్చాను; మరి యిట్లయింది" అన్నది. అంతకంటె ఏంగావాలి?— పోలీసువారు "పేరమ్మ రామస్వామికి విషం పెట్టి చంపిం"దని ఛార్జి పెట్టారు. మేస్త్రీటుగారు

"ఓయబ్బో, ఇంతపెద్ద కేసుగావుందే" అని జిల్లా జడ్జిగారికి పంపించారు. జిల్లాజడ్జిగారు "ఏమీ లేకుంటే నాదాకా ఎందుకురా వచ్చిం" దని ఉరిశిక్ష వేశారు.

౪

బయటపడితే మళ్లీ తనవూరికి వెళ్లవచ్చు. వెళ్లి తనతల్లితో సుఖంగా ఉండవచ్చు. ఇంక పేటకు చస్తే రాననుకుంది. తన వెయ్యిరూపాయలసొమ్ము కోటయ్యవద్దనుంచి లాక్కొని వూరికెళ్లి తల్లితోపాటు సేద్యప్పనులు చేసుకోవాలి. ఛ! ఈపేటవాండ్లను నమ్ముకుంటే ఇంతే. ఉన్నన్నాళ్లు ఉండి పొయ్యేటప్పుడు కొరివి ఒకటి కాల్చిపెట్టిపోతారు. కొరివి అనుకోగానే ఆ వెన్నెలతునక మరచిపోయిన తనకండ్లకు మళ్లీ కనుపడ్డది. ఈ మూడురోజుల జాగారం దృగ్గోచరం అయింది. మళ్లీ ఊపిరాడలేదు. బయట అయితే శుభ్రమైన గాలి అయినా తిని బ్రతకవచ్చు. ఈవేడి బరువుగాలి! ఎట్లాగా మనుషులుంటారు ఇక్కడ! పొంగిపొంగివస్తూన్న తనమనోభారాన్ని వదిలించుకోడానికి గోడలైనా వినేవి కావే. ఇట్లా ఇంకా ఒకటిరెండురోజులు ఉండగలుగునా! ఉరిశిక్షఅంటే ఇదేకాబోలు. ఇంకా ఉరిశిక్ష ఏమిటి?—

౫

పేరమ్మకు తట్టిలేపినట్లయింది. కండ్లు తెరిచేటప్పటికి మధ్యాహ్నము అయింది కాబోలు, జెయిలువార్డరు మూకుడులో సంకటివేయించి మంచిసెబ్బరలు కనుక్కొని పోతున్నాడు. పేరమ్మకు విసుకుపుట్టింది. ఆ మూడురోజులనుంచి తనకుగా వేస్తున్న సంకటి అట్లనేవుంది, ఎందుకు వీరికీబాధ? గుండె రాయి చేసుకొని పేరమ్మ జెయిలువార్డరును అడిగింది.

"నాయనా, ఎప్పుడు—"

ఎంత కఠినుడికైనా మనసు కరుగుతుంది. ఎంతఘోరకలి, ఎంత క్రూరమైన నేరముచేసినా, అతనిని శిక్షించవచ్చేటప్పటికి అయ్యోపాపం అనిపిస్తుంది. ఆజెయిలువార్డరు ప్రొద్దునలేస్తే మనుష్యాకారాల్లోవుండే క్రూరమృగాలనూ, నాగుబాములనూ చూస్తూవుండడమేకాని సిసలైన మనుష్యులను ఆట్టె చూడడం తటస్థించదుగా! అందుచేత అతను జాలిఅంటే ఏమిటోకూడా మరచిపోయినాడు. గిర్రుమనితిరిగి ఇంకావుంటే ఏం మాట్లాడవలసి వస్తుందో అన్నట్లుగా అతడు వెళ్లిపోయినాడు.

౬

ఇట్లా జరిగింది కొన్నినెలలు. పేరమ్మకు పిచ్చెక్కింది. ఆకలిఅంటే ఏమిటో మరచిపోయింది. ఇక్కడ తన్ను తిట్టేవాండ్లుగాని, కొట్టేవాండ్లుగాని ఎవ్వరూలేరు. తన జోలికి వచ్చేవారు లేరు. తనసంగతి అనుకొనేవారు లేరు. అంతకంటె ఈ జీవశాంతికి కావలసినదేమిటి? అట్లాఉండడంలో, తన్ను భగవంతుడికి సూటిగా ముఖాముఖి నిలపెట్టారన్నమాట. అయితే కండ్లు విచ్చిచూచుటకు

పేరమ్మకు ధైర్యము లేదు. శక్తి చాలలేదు. సూర్యుణ్ణి ఎకావెకి చూడడానికి సామాన్య మాత్రులకు చేతవుతుందా? గాఢాంధకారాన్నిమాత్రం మనోధైర్యం, ఆత్మశక్తి లేని వారు ఓర్వగలరా?

౨

ఒకనాటి సాయంకాలం జెయిలు వార్డరు పేరమ్మన్నుంచే గుహాతలుపు తటాలున తీయించాడు. తీయించి పేరమ్మను లేపి — "నీశిక్షను హైకోర్టువారు తొలిగించారు. నిన్ను విడుదల చేయడమైంది" అన్నాడు; తనకు వూరికి చేరుటకుగా రైలుఛార్జీ యిచ్చి, జెయిలుబయటికి వెళ్లగొట్టాడు. ఆరోజు ఉరిశిక్ష చెప్పినప్పుడు నిలుచున్నమనిషి నిలుచున్నట్లుగానే పడిపోయింది. ఇప్పుడుకూడా నిశ్చేష్టయై అట్లనే పడిపోయింది. ఇంచుక తెలివిరాగానే కాళ్లీడ్చుకుంటూ వూళ్లోకి బయలుదేరింది. తన్ను పలకరించేవారు లేరు. తనసంగతి అనుకొనేవారు లేరు. మతిపోయిందై ఏమిచేయుటకు తోచక నేరుగా రైలుస్టేషనుకు వెళ్లి, పేటకు టిక్కట్టు తీసికొన్నది. రాత్రి ౮ గంటలకు వాండ్లపేట చేరింది. సరాసరి కోటయ్యయింటికి వెళ్లింది. వెళ్లితే ఏముంది? ఇల్లు తాళంవేసివుంది. గుండెలో రాయిపడ్డది. అక్కడే ఆ ఇంటి ఖామందు పండుకొనున్నాడు. ఆయనన్నడిగింది, "కోటయ్య ఎక్కడ, ఏమైనా" డని. ఆయన పేరమ్మను చూచి ఉసూరుమని నిట్టూర్పు విడిచాడు, ఏం పేరమ్మా అని. పేరమ్మవచ్చిన సంగతి తట్టేటప్పటికి నిర్ఘాంతపోయినాడు. పేరమ్మ ఏమిటి, మళ్లీ రావడమేమిటి? చచ్చినవాండ్లు ఎక్కడైనా మళ్లీ లేచివస్తారా! — అతని కంతా చోద్యంగా తోచింది. 'ఏం పేరమ్మా, నిన్ను వురితీశారుగదా, ఎట్లావచ్చావు' అన్నాడు, నిద్రకత్తులలో ఇంకా కండ్లువులుముకుంటూ. పేరమ్మ తనసంగతంతా చెప్పింది, భారం తగ్గేటట్లు. అప్పటికి అతనికంతా తెలిసి— 'ఆహా! అట్లాగేం' అన్నాడు. పేరమ్మ ఆమాట ఈమాట చెప్పి మళ్లీ కోటయ్య సంగతి అడిగింది.

"కోటయ్యా—కోటయ్య ఆ మరునాడే వూరు వదలిపెట్టి వెళ్లాడుగా దేశంమీదికి— నీసొమ్ముయావత్తు ఆరోజే అమ్ముకొనిపోయినాడు. ఎక్కడపోయినాడో మళ్లీ కంటికి కవుపడలేదు. రంగంవెళ్లాడేమో ననుకుంటున్నారు." అని అన్నాడు మహాకష్టంతో.

పేరమ్మకు మాట రాలేదు. అరగంటసేపు కొయ్యబారి కూర్చుంది. ఉండి ఉండి,

"ఊరికిపోయి మాఅమ్మను చూచివస్తా, ముసిలిముండ ఎట్లాఉందో" అంది.

"ఆఁ. చెప్పడం మరచిపోయినా. మీ అమ్మ చచ్చిపోయిందిగా! మీయిల్లు మీ వూరిమునసబు అదెందుకో వేలం వేయించాడట" అన్నాడు.

పేరమ్మ నిశ్చేష్టురాలయింది.

ఇంతకాలానికిగా ఇప్పుడు ఆకలయింది. ఇన్నాళ్లనుంచి ఎక్కడపోయిందో. ఒక్క ముద్దయినా తినంది ఉండలేదు ఇంక. అన్నం

పెట్టించమని అడిగింది, ఆముసలాణ్ణి. పట్టకపట్టక పట్టినన్రిద పాడు చేసిందని తిట్టుకుంటున్న వాడు విసుక్కొని,

"ఇప్పు డేమన్నం, నా పిండాకూడు. చాల్చాల్లే, నా న్రిద కాస్తా పాడుచేసావు పోపో" మ్మన్నాడు.

పేరమ్మ తన బలమంతా పోగుచేసుకొని లేచింది. ఏమిచేయడానికీ తోచలేదు. ఇశ్శబ్బా— అన్నం అడుక్కోడంకూడా తెలీదు. అదిమాత్రం చేతకావద్దూ. బజారునపడిపోయి, పెద్ద శెట్టి మేడవాకిట నిలుచొని "అన్నంపెట్టమ్మా" అంది. లేదు పొమ్మని ఇంట్లోనుంచి కేక వచ్చింది. మళ్లీ అరిచింది. ఇంట్లోనుంచి ఒక ముసలావిడె, కొట్టేటట్టుగా వచ్చి, "నీకేం బుద్ధి లేదూ— బేహా— నీకుగాదూ చేప్పేది— దున్నపోతా" అని శరపరంపరలుగా కురిపించింది.

౮

పేరమ్మ వీధిమధ్యకువచ్చి కూలబడ్డది. లోకానికి తనయందు ఎందుకో ఇంతవిరోధం. నిమేషమాత్రం "ఇంతకంటే జెయిలే మేలేమో" ననిపించింది. ఉరేహోయి. అట్లాగే ఆకాశంవంక చూచింది. ఎందుకు చూచిందో తనకు తనకే తెలీదు. అప్పుడైనా దేముణ్ణి తలుచుకుందో లేదో చెప్పజాలదు. మిణుకు మిణుకు

మనే నక్షత్రాలను చూచింది. చల్లని గాలి సోకింది. ఛ! తాను తప్పించుకొందిగా ఉరిశిక్ష—చల్లనిగాలి కొట్టేటప్పటికి పై ప్రాణాలు పైకివచ్చాయి, పేరమ్మకు. అంతకు ముందు అన్నము ముట్టడానికిగూడా అసహ్యించుకున్న యీ పేరమ్మ, యిప్పుడు తనఆకలిని ఏమైనా చంపుకోగల్గిందా? అయితే ఎంత అసహాయురాలైనా తనచుట్టూ కోటగోడలు లేవు ఇప్పుడు. బరువుగాలి ఇప్పుడు తన్ను అణచడంలేదు. ఎటుచూచినా విశాలప్రపంచం కనుపడ్డది. తనకు తెలీకుండానే తన కడుపు నిండింది. అరకన్ను వేశి వెనక్కుపడ్డది, "అబ్బా—ఇదేచాలు" అని. ఆనిద్ర నుంచి ఎప్పుడులేచిందో, ఎట్లా లేచిందో ఎవరు చెప్పగలరు?



తుంగభద్రానది

శ్రీ విరూపాక్షాలయముప్రక్కను సన్నని కొండలోయలో ప్రవహించుచున్నది.

(హంపి శిథిలములు)

—కే. యల్. నరసింహాచార్యులు, గుంతకల్లు.